క్లుప్తంగా

రేపటి నుంచి రట్టి వల్లభ నారాయణుడి డోలోత్సవాలు

కాశీబుగ్గ: మందస మండలం రట్టి గ్రామంలో వల్లభ నారాయణస్వామి డోలోత్సవ జాతర ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ ఈవో టి.వాసుదేవ రావు, యువజన సేవా సంఘ సభ్యులు తెలిపారు. ఇప్పటికే ఆలయాన్ని అంగరంగ వైభవంగా అలంకరించినట్లు చెప్పారు. అర్చకులు రట్టి నీలకంఠం, రట్టి ప్రహ్లాద, రట్టి సీతారాం నేతృత్వంలో 9వ తేదీ రాత్రి అంకురార్పణ, 10న ఏకాదశి పంచామృత అభిషేకాలు, 11న ధ్వజారోహణ విశేష హోమాలు, 12న కామ దహనోత్సవం, 13న వల్లభ నారాయణస్వామి నిజ స్వరూప దర్శనం, 14న డోలోత్సవ పౌర్ణమి పేరిట సముద్ర స్నానాలు జరుగుతాయని వివరించారు. పలాస డిపో నుంచి హరిపురం మీదుగా ప్రత్యేక బస్సులు వేశా ఎటువంటి అవంచానియా సంఘటనలు జరగకుండా పోలీస్‌లు గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు.

మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలి

టెక్కలి: మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలని, లింగ వివక్షత లేకుండా చూడాలని, ఆడ పిల్లలపై హింస విడనాడాలని మహిళలు నినాదాలు చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూటీఎఫ్, ఐద్వా, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం టెక్కలిలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలని, కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనాలు అందజేయాలని కోరారు. సీఐటీయూ నాయకుడు ఎన్.షణ్ముఖ రావు, బి.రమణమ్మ, జి.భాగ్యం, డి.ఆదిలక్ష్మి, ఎస్.ఉమాబాయి, బి.మల్లేశ్వరి, కె.లత, టి.యశోదమ్మ పాల్గొన్నారు.

సైనిక లాంఛనాలతో ఆర్మీ జవాన్ అంత్యక్రియలు



తిరుపతిరావు పార్థివదేహంపై జాతీయ జెండా ఉంచి అంజలి ఘటిస్తున్న ఆర్మీ అధికారులు

వజ్రపుకొత్తూరు: జమ్మూ కాశ్మీర్‌లో ఈ నెల 4న మృతి చెందిన ఆర్మీ జవాన్ బచ్చల తిరుపతిరావు మృతదేహం శుక్రవారం స్వగ్రామం అమలపాడుకు చేరుకుంది. ఆర్మీ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్మీ అధికారులు, సైనికులు త్రివర్ణ పతాకాన్ని తిరుపతిరావు భౌతికకాయంపై ఉంచి పుష్ప గుచ్ఛాలతో నివాళులు అర్పించారు. శ్రీకాకుళం ఏఆర్ పోలీసు సిబ్బంది గాలిలోకి కాల్పులు జరిగి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం తిరుపతిరావు సోదరుడు బచ్చల గోవింద తలకొరివి పెట్టారు. వజ్రపుకొత్తూరు ఆర్మీ, ఎన్‌సీసీ, ఏఆర్ పోలీసు అధికారులు, ఏఎస్ఐ నూక అప్పల నాయుడు, సిబ్బందితో పాటు గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఇరాక్‌లో వలస కూలీ మృత్యువాత



తిప్పన భుజంగరావు(ఫైల్)

కవిటి: మండలంలోని ఆర్.బెలగాం గ్రామానికి చెందిన తిప్పన భుజంగ రావు(43) పొట్టకూటి కోసం ఇరాక్ వెళ్లి అనుకోని దుర్ఘటనలో ప్రాణాన్ని కోల్పోయాడు. ఈ మేరకు గ్రామస్తులకు శుక్రవారం సమాచారం అందింది. భుజంగరావు ఇరాక్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో నాలుగేళ్లుగా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 6న అమ్మోనియా ట్యాంకర్ పేలుడు కారణంగా మృతిచెందాడు.

సుమహాసన్‌కు డాక్టరేట్ ప్రదానం



వీసీ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న సుమహాసన్

టెక్కలి: కోటబొమ్మాళి మండలం కస్తూరిపాడు గ్రామానికి చెందిన సింగుపురం సుమహాసన్‌కు జేఎన్‌టీయూ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఐఓటీలో ఆరోగ్య సంరక్షణ సెన్సరీ డేటా భద్రత, సమర్థవంతమైన ప్రసారం నోడ్ లెవల్ విధానంపై నిర్వహించిన పరిశోధనలకు డాక్టరేట్‌ను అందజేశారు. విజయనగరం జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో పరిశోధనలు కొనసాగించారు. సుమహాసన్ ప్రస్తుతం విశాఖపట్టణం గాయత్రీ విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

రయ్..రయ్ మనిపిస్తున్న 'రాధ'



ద్విచక్ర వాహనాన్ని బాగు చేస్తున్న ఈమె పేరు పొల్ల రాధ. గిరి అనే యువకుడిని వివాహం చేసుకుంది. భర్త బైక్ మెకానిక్. ఒడిశా ప్రాంతానికి చెందిన ఈ దంపతులు బతుకు తెరువు కోసం కొన్నేళ్ల క్రితం పలాస చేరుకున్నారు. పలాస ఎంపీడీవో కార్యాలయం వద్ద బైక్ మెకానిక్ షెడ్‌ను పెట్టుకున్నారు. అయితే గిరి సడన్‌గా వినికిడిని కోల్పోయాడు. రెండు చెవులు వినిపించకపోవడంతో ఎవరైనా కస్టమర్ తమ వాహనాన్ని బాగుచేయించుకోవడానికి తీసుకొచ్చి సమస్య చెబితే గిరికి వినిపించక సమస్య తలెత్తేది. దీన్ని గమనించిన రాధ.. రోజూ భర్తతోపాటే మెకానిక్ షెడ్‌కు చేరుకునే వారు. భర్త వాహనాన్ని బాగుచేస్తే క్షుణ్ణంగా గమనిస్తుండేది. అలా వాహనాలను బాగు చేయడం నేర్చుకున్నారు. ఇప్పుడు అన్ని వాహనాలను బాగు చేస్తూ భర్తకు చేదోడువాదోడుగా ఉంటూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

-కాశీబుగ్గ



'చెప్పు'కోలేని బాధను ఎదర్కొని..



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు గురివారి దాస్. పలాస ఆర్టీసీ డిపో ఎదురుగా కల్వర్టు పక్కన చెప్పులు కుడుతూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న ఈమె ఎందరికో ఆదర్శనీయం. ఒడిషా రాష్ట్రం గంజాం జిల్లా బరంపురం పట్టణ సమీపంలో మారుమూల గ్రామానికి చెందిన గురివారి దాస్.. లక్ష్మణదాస్ అనే వ్యక్తిని వివాహం చేసుకున్నారు. బతుకుతెరువు కోసం ఒడిశా నుంచి పలాస చేరుకున్నారు. చెప్పులు కుడుతూ వచ్చే డబ్బులతో హాయిగా బతుకు బండిని ఈడ్చేవారు. ఇద్దరు కుమారులతో సంతోషంగా సాగిపోతున్న ఆ కుటుంబానికి చెప్పుకోలేని కష్టం వచ్చింది. లక్ష్మణదాస్ అనారోగ్యంతో ఆకస్మికంగా మృత్యువు ఒడికి చేరడంతో గురివారి దాస్‌పై కుటుంబభారం పడింది. ఇద్దరు చిన్నపిల్లలను పెంచుకోవడం కష్టంగా మారింది. అయితే ఆమె కుంగిపోలేదు. భర్త బతికి ఉన్న సమయంలో అతనికి మధ్యాహ్న వేళ భోజనాన్ని తీసుకెళ్లేటప్పుడు చెప్పులు కుట్టడాన్ని నేర్చుకున్న ఆమె.. ఆ పనినే వృత్తిగా మార్చుకున్నారు. రోజువారీ వచ్చే ఆదాయంతోనే పిల్లలను పెద్ద చేశారు. అయినప్పటికీ కష్ట సమయంలో ఆదుకున్న చెప్పులు కుట్టే పనిని మాత్రం ఆమె విడిచి పెట్టలేదు.

-కాశీబుగ్గ

మహిళల భద్రత నిర్లక్ష్యం దిశగా..

- మూలకు చేరిన దిశా సైబర్ కవచ్ యంత్రం
- గత ప్రభుత్వంలో విశేషంగా సేవలందించిన మెషీన్
- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో మూలకు చేరిన వైనం
- మహిళలకు తప్పని సైబర్ నేరగాళ్ల వేధింపులు

శ్రీకాకుళం క్రైమ్: మన ఫోన్‌లో డేటా మనకు తప్ప ఎవరికీ తెలియదనే నమ్మకంతో ఉంటాం. అయితే సైబర్ కేటుగాళ్ల కన్నుపడిందా అంతే సంగతులు. ముఖ్యంగా మహిళలకు వేధింపులు తప్పవు. వ్యక్తిగత సమాచారం సేకరించి లింకులు, యాప్‌ల ద్వారా అకౌంట్లలోని సొమ్మును ఖాళీ చేస్తుంటారు.

- వందలాది ఫొటోలను చాలామంది సోషల్ మీడియాలో పోస్టు చేస్తుంటారు. ప్రొఫైల్ పిక్స్‌కు లాక్ పెట్టుకోరు. మహిళల విషయంలో ఇది అంత మంచి పద్ధతి కాదని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- సైబర్ నేరస్థులు ఐడెంటిటీ థెఫ్ట్ ద్వారా మహిళలు, యువతుల ఫొటోలు, వీడియోలు దొంగిలించి వాటిని మార్ఫింగ్ చేస్తారు. ఇంటర్‌నెట్ / సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో అప్‌లోడ్ చేస్తామని బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బును దోచుకోవడం, లైంగికంగా వేధించడం వంటి పనులు చేస్తారు.
- వాట్సాప్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి యాప్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లే కాక ఫ్రెండ్స్ ముసుగులో కొందరు యువతులను, మహిళలను మోసగించాలని చూస్తారు.
- అసభ్య చాట్స్, న్యూడ్ వీడియోకాల్స్‌కు ప్రేరేపించి వాటిని రికార్డు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని, ఫ్యామిలీ / ఫ్రెండ్స్‌కు పంపిస్తామని బ్లాక్ మెయిల్ చేసి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తారు. హనీ ట్రాప్‌లో ఇది ఒక కొత్త తరహా నేరం. ఈ సైబర్ నేరాల్లో స్త్రీలే ఎక్కువగా బాధితులు.




నేడు | ఎస్పీ ఆఫీసులో మూలకు చేరిన సైబర్ కవచ్ మెషీన్



నాడు | దిశ సైబర్ కవచ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ రాధిక(ఫైల్)

ఈ చిత్రంలో దుమ్ముపట్టి మూలకు చేరిన యంత్రం ఏమిటో తెలుసా..!

దీని పేరు దిశ సైబర్ కవచ్ ఇది. సైబర్ కేటుగాళ్ల నుంచి రక్షణగా ముఖ్యంగా మహిళల భద్రత కోసం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంత్రం ఇది. దీని ఉపయోగమేమిటో తెలుసా.. మొబైళ్లు, ఇతర ఎల్రక్టానిక్ పరికరాలను సైబర్ మానిటర్‌కు కనెక్ట్ చేసి స్కాన్ చేస్తే అందులో ఉన్న వైరస్, సైబర్ మాల్వేర్‌తో పాటు మనకు తెలియకుండా ఇన్‌స్టాల్ అయిన యాప్‌లను కూడా గుర్తించి వాటిని తొలగించేది. దీనికోసం ప్రత్యేకంగా ఓ పోలీసు సహాయకున్ని సైతం నియమించారు. మొబైల్ ఛార్జింగ్ పిన్ నుంచి యూఎస్‌బీ కేబుల్ ద్వారా మెషిన్‌కు అనుసంధానిస్తే మొబైల్‌లో ఉన్న సమాచారాన్ని బట్టి వైరస్‌ను గుర్తిస్తుంది. మొబైల్‌లో తెలియకుండా యాప్‌లు, సాఫ్ట్‌వేర్‌లు గుర్తిస్తుంది. వాటిని వెంటనే డిలీట్ చేసుకోవచ్చు. ఈ మోనిటర్ ద్వారా ఎటువంటి వ్యక్తిగత సమాచారం తస్కరించబడదు. ప్రజలకు ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగపడే ఈ మిషన్ ఇప్పుడు దుమ్ము ధూళితో తుప్పు పట్టి ఎస్పీ కార్యాలయంలో ఓ మూలకు చేరడం పలువురినీ విస్మయపరుస్తోంది. కూటమి ప్రభుత్వ తీరును పలువురు తప్పుబడుతున్నారు.



జిల్లాలో కొన్ని సైబర్ మోసాలు..

- ఇటీవల జిల్లాకేంద్రంలో ఓ విద్యార్థిని ఫొటోలు, వీడియోలు తస్కరించిన తిరుపతి యువకుడు అశ్లీల వెబ్‌సైట్లలో పెట్టాడు. మరో యువకుడు వాటిని డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాగామ్, వాట్సాప్ తదితర యాప్‌ల్లో పంపి సొమ్ము చేసుకున్నాడు.
- జిల్లాలోని ఓ గ్రూప్-1 మహిళా అధికారిణిని కొన్ని నెలల కిందట ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా న్యూడ్ చిత్రాలు, వీడియోలు రూపొందించి సైబర్ కేటుగాళ్లు మోసం చేద్దామనుకున్నారు. ఆమె అప్రమత్తం కావడంతో తృటిలో తప్పించుకోగలిగింది.
- జిల్లా స్త్రీ శిశు సంక్షేమాధికారి బి.శాంతిశ్రీని సైతం సైబర్ ఉచ్చులో పడి తృటిలో తప్పించుకున్నారు.
- ఎంతో మంది విద్యార్థినులు తమకు ఇన్‌స్టా, వాట్సాప్ యాప్‌ల్లో యువకులు వేధింపులు ఎక్కువయ్యాయని ఎప్పటికప్పుడు సైబర్‌సెల్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు.

శక్తివంతగా మహిళలు ఎదగాలి



టెక్కలి: అన్నపూర్ణమ్మను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ తదితరులు



కాశీబుగ్గ: మహిళా దినోత్సవంలో ఎస్ఎఫ్ఎస్ పాఠశాల టీచర్లు



కవిటి: ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న దృశ్యం

టెక్కలి: సమస్యలను ఎదుర్కొనే శక్తివంతంగా మహిళలు ఎదగాలని బాల వికాస్ నిర్వాహకురాలు, సత్యసాయి నిత్యన్నపూర్ణ సేవా కార్యకర్త బలివాడ అన్నపూర్ణమ్మ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కష్టాలను ఎదురించే శక్తి, సమస్యలను సాధించగలిగే యుక్తి మహిళలకు ఉందన్నారు. అనంతరం అన్నపూర్ణమ్మతో పాటు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, మహిళా సాధికారత విభాగం ప్రతినిధులు వై.లీలాపద్మజ, ఝాన్సీరాణి, కవిత, తేజోవతి, సుహారిక, జి.భారతి, లక్ష్మి, నాగమణి, అప్పమ్మ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నరేంద్రనాథ్ పట్నాయక్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. టీచర్లు జ్యోతి, పద్మావతి, రేణుక, అమిత, స్వప్న రాణి, చంద్రవదన, బర్షనాయక్, దేవకి, వాణిలను ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించారు.

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. మహిళా ఉపాధ్యాయినులను సత్కరించి గౌరవించారు.

కవిటి: ఇద్దివానిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ముందస్తుగా శుక్రవారం జరుపుకున్నారు. హెచ్ఎం తనూజాతో పాటు ఉపాధ్యాయినులు అప్పలనరసమ్మ తదితరులను దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి రోటరీనగర్‌లో ఉన్న ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో ఘనంగా మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇక్కడ పని చేస్తున్న 35 మంది మహిళా ఉపాధ్యాయినులకు యాజమాన్య ప్రతినిధులు గులాబీ పువ్వులను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడాపోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



ఇచ్ఛాపురం: ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న సిబ్బంది



ఇచ్ఛాపురం రూరల్: సత్కారం పొందిన టీచర్లు

మహిళా హక్కుల సాధనకు ఉద్యమాలు అవసరం

- జిల్లా ఐద్వా నాయకురాలు సుగుణ

వజ్రపుకొత్తూరు రూరల్: మహిళా హక్కుల కోసం అందరూ కలిసికట్టుగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని జిల్లా ఐద్వా నాయకురాలు బమ్మిడి సుగుణ అన్నారు. నగరంపల్లిలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా నాయకులు మాట్లాడుతూ సమాజంలో రోజు రోజుకు మహిళలపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న మహిళ శ్రామికులకు పని చేసే చోట రక్షణ లేకుండా పోతుందని అన్నారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన పాలకులు మొద్దునిద్రలో ఉన్నారని విమర్శించారు. మహిళ సంఘ నాయకులు ఎన్.ధనలక్ష్మి ,బి.లక్ష్మీ, ఎస్.ఈశ్వరమ్మ, టి.లక్ష్మి, ఎస్.రజిని, డి.కాంతమ్మ, టి.నిర్మల ఉన్నారు.

నేడు పలాసలో ఎల్లమ్మ జాతర

- లక్ష మందికిపైగా భక్తులు హాజరయ్యే అవకాశం
- ఉదయం ఆరు నుంచి రాత్రి 2 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు



ముస్తాబైన ఎల్లమ్మతల్లి ఆలయం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఎల్లమ్మ వీధిలో వెలసిన ఆలయంలో ఆదివారం జరిగే జామి ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తియ్యాయి. ఏటా మహా శివరాత్రి అనంతరం తొమ్మిది రోజులు తరువాత ఇక్కడ ప్రత్యేక పూజలు ప్రారంభం అవుతాయి. పురాతన తర్లాకోట జమిందారుల కాలం నుంచి సంప్రదాయ పద్ధతిలో జాతర నిర్వహిస్తారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు యాత్రకు తరలివస్తారు. ఈ ఏడాది కూడా లక్ష మందికి పైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో కమిటీ సభ్యులు, అధికారులు ఏర్పాట్లు చేశారు. శనివారం వేకువ జాము నుంచి రాత్రి 11 గంటల వరకూ ఎల్లమ్మ దర్శనానికి చర్యలు తీసుకున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు..

జాతర నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు చేపట్టారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో రెండు కిలో మీటర్ల మేర రోడ్డును డీఎస్పీ వి వెంకటఅప్పారావు అనుమతులతో శనివారం బ్లాక్ చేయనున్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా పలాస ఎర్రచెరువు నుంచి జగన్నాథ సాగరం మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. పలాస చేరుకోవాలంటే శివాజీనగర్ మీదుగా ఎర్రచెరువుకు లేదా జగన్నాథ సాగరం మీదుగా జీడిపిక్క బొమ్మ వద్దకు చేరుకోవచ్చు. తిరిగి అదే రహదారుల్లో కాశీబుగ్గ పట్టణానికి చేరుకోవచ్చని, కేటీరోడ్డు మీదుగా కాలినడక యాత్రికులకు మాత్రమే ప్రవేశం కల్పిస్తున్నట్లు కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ తెలిపారు.

భారీ బందోబస్తు..

ఎల్లమ్మతల్లి జాతర సందర్భంగా భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్టు డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. 138 మంది పోలీసులు, అధికారులు విధుల్లో ఉంటారన్నారు. అలాగే శనివారం ఉదయం ఆరు నుంచి రాత్రి రెండు గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు అమల్లో ఉంటుందని.. ఈ విషయాన్ని అందరూ గమనించి సహకరించాలని కోరారు.కాశీబుగ్గ నుంచి పలాస వచ్చే పెద్ద, చిన్న వాహనాలను మూడు రోడ్ల కూడలి వద్ద నిలిపి వేయాలన్నారు. కేవలం కాలినడకన వచ్చేవారికి మాత్రమే లోనికి అనుమతిస్తామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా రెండు డ్రోన్లతో నిఘా ఉంటుందన్నారు.

18న ఎయిర్‌పోర్టు చైతన్య యాత్ర

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతాన్ని ఉరి తీసే కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 18, 19వ తేదీలలో తలపెట్టిన ప్రజా చైతన్య పాదయాత్రలు విజయవంతం చేయాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కాశీబుగ్గ పాత జాతీయ రహదారిలోని ఓ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన మేథో మదన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో పాదయాత్రలు, సైకిల్ యాత్రల్లో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. చాపర వెంకటరమణ, డి.గోవిందరావు, వంకల మాధవరావు, కోనారి మోహన్‌రావు, చాపర వేణుగోపాల్, కొమర వాసు, గొరకల బాలకృష్ణ పాల్గొన్నారు.

కాశీబుగ్గ: ఎయిర్‌పోర్టుకు నిర్మాణానికి తాము వ్యతిరేకమని మందస మండలం రాంపురం పంచాయతీ బిడిమి గ్రామస్తులు స్పష్టం చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సహకరిస్తామని ఇటీవల కొందరు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని చెప్పారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

ఎల్లమ్మ జాతర శుక్రవారం వైభవంగా జరిగింది. ఇచ్ఛాపురం పట్టణంలోని బెల్లుపడ, కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లోని పలు గ్రామాల్లో ఉన్న ఎల్లమ్మ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే ఆలయాలకు వెళ్లి పుట్టకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.


-సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం: బెల్లుపడ ఎల్లమ్మ పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు

సమన్వయంతో పనిచేద్దాం

- మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్

ఇచ్ఛాపురం/ఇచ్ఛాపురం రూరల్: గ్రామస్థాయి నుంచే వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేద్దామని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన జిల్లా, నియోజకవర్గ, మండల వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల కార్యవర్గంతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు పాటిస్తూ ప్రజల పక్షాన పోరాటం చేయాలని అన్నారు. ఎంపీపీ బోర పుష్ప, మండల పార్టీ అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, పార్టీ అనుబంధ విభాగాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆరంగి శరత్‌కుమార్ ఔదర్యాన్ని చాటుకున్నారు. పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న 72 మంది విద్యార్థులకు తొమ్మిది రకాల పరీక్ష సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ ఆరంగి వసంతరావు, సాయి మానస, బెండి అరుణకుమార్, పొందల సురేష్, హెచ్ఎం కోత చైతన్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

– సంతబొమ్మాళి

ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం



నందిగాం మండలం నరేంద్రపురంలో నిర్మించిన రెయ్యి బోడెమ్మతల్లి, భూలోకమాత అమ్మవార్ల ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. బంకుపల్లి సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు వైద్య భూషణ సత్యనారాయణశర్మ నేతృత్వంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ప్రతిష్ఠ విగ్రహాలకు గ్రామప్రదక్షిణ, తిరువీధి మహోత్సవం మేళతాళాలతో, చిన్నారుల కోలాట నృత్యాలతో నిర్వహించారు.

-నందిగాం

భక్తి నీరాజనం



సోంపేట మండలం తాళ్లభద్రలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. బాలత్రిపురసుందరి సేవాసదన్ వ్యవస్థాపకులు అక్కాజ్యోసుల రమేశ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం నిర్వహించిన స్వామివారి విగ్రహాల తిరువీధి మహోత్సవంలో అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

-సోంపేట

మెప్మా సిబ్బంది ప్రతిభ



పిట్ట గీత



పొట్నూరు జీవిత

కాశీబుగ్గ: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మెప్మా విభాగంలో ఉత్తమ సేవలు అందించిన ఆర్పీలకు జిల్లా స్థాయిలో అవార్డులు వరించాయి. ప్రథమ, ద్వితీయ ర్యాంకులు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు ఆర్పీలకు దక్కాయని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు శుక్రవారం తెలిపారు. మూడోవార్డు పద్మనాభపురం గ్రామానికి చెందిన పిట్ట గీతా ప్రథమ, పలాసకు చెందిన పొట్నూరు జీవిత ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరిని శనివారం జిల్లా కేంద్రంలో జరగనున్న మహిళా దినోత్సవ వేడుకలో కలెక్టర్ సత్కరించి బహుమతులు అందజేస్తారన్నారు.

అడిషనల్ పీపీగా అచ్చెన్నాయుడు

టెక్కలి: టెక్కలి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కోటబొమ్మాళి మండలానికి చెందిన సీనియర్ న్యాయవాది కింజరాపు అచ్చెన్నాయుడును నియమిస్తూ ఏపీ న్యాయశాఖ విభాగం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన మూడేళ్లు ఏపీపీగా కొనసాగనున్నారు. టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.